ఏదైనా ఒక పని చేసేటప్పుడు అది సమాజానికి ఉపయోగపడాలి, అదే పని మీకు మోక్షం రావటానికి సహకరించాలి, అంటే అంతఃకరణశుద్ధి అవ్వాలి.

మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు సాధన చేసి కనీసం ఒక్క వాసనను అయినా తగ్గించుకొని ఈ భూమి మీద నుండి వెళ్ళిపోవాలి. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే పది వాసనలతో వచ్చి, ఇక్కడ ఇంకో పది వాసనలు కలుపుకొని ఈ భూమి మీద నుండి వెళు తున్నాము, ఇటువంటి మనకా మోక్షం కలిగేది? ఒక 10 రూపాయలు అప్పుతో వచ్చి, ఇంకో పది రూపాయలు అప్పుచేసి మొత్తం 20 రూపాయలు అప్పుతో బయటకు వెళుతున్నాము. అలాకాదు కనీసం 5 రూపాయలు అప్పు తగ్గించుకొని 5 రూపాయల అప్పుతో బయటకు వెళితే పరవాలేదు. మనం సాధన పేరుతో వాసనలు పెంచుకొంటున్నాము, ఇది ప్రమాదం. మన డ్యూటీ మనం శ్రద్ధగా చేయాలి, జరిగేది జరుగుతుంది. పని నీ చేతిలో ఉంది కాని ఫలితం నీ చేతిలో లేదు. ఫలితం నీ చేతిలో లేదని పనిమానివేసి సోమరితనానికి అలవాటు పడవద్దు. బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం పనిచేసి మర్చిపోవాలి. ఫలితం కోసం ఎదురు చూస్తూ ఉంటే బుద్ధి కల్మషం అయిపోతుంది, బుద్ధి మోహకలిలంలో కూరుకొనిపోతుంది. బుద్ధుడు భిక్ష చేసుకొనేటప్పుడు వాళ్ళ ఇంటి దగ్గర కూడా భిక్ష చేస్తాడు, వాడి నిరహంకారస్థితిని చూడండి. నీవు మహారాజువు, ఈ భిక్ష చేసుకోవటం ఏమిటి అంటాడు తండ్రి, నిజమే రాజులు భిక్ష చేసుకోకూడదు, కాని నేను భిక్షువుని అంటాడు, ఎంత నిరహంకారమో చూడండి. ఇది నోటితో చెప్పటం తేలిక, ప్రాక్టికల్‌గా చేయటం ఎంత కష్టమో చూడండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-01-06, తాడినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరుల క్షేమం కోసం, ఇతరుల మంచికోసం మనం ఏ పనిచేసినా అది యజ్ఞమే. ఇతరుల క్షేమం కోసం మాటమాట్లాడినా, శరీరంతో పనిచేసినా, ఇతరులకు మంచి జరగాలని మనస్సులో సంకల్పించుకొన్నా ఇది అంతా యజ్ఞమే. మనకు మంచితలంపులు వచ్చినా, చెడుతలంపులు వచ్చినా, కోరికలు వచ్చినా అన్నీకూడా దేహము నేను అనే బుద్ధిలో నుండే వస్తున్నాయి. మనలో రెండు నేనులు ఉన్నాయి. చనిపోయే నేను, చావులేని నేను రెండూ మనలోనే ఉన్నాయి. దేహం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాము కదా, అంటే దేహము నేను అనే బుద్ధి ఈ నేనుకు ఉంది, ఇదే దేహగతమైన నేను, చనిపోయే నేను, మిధ్యానేను. ఈ చనిపోయే నేను మనలో ఉన్నంతకాలం మనం చనిపోతూ ఉంటాము, పుడుతూ ఉంటాము. ఇది దేహంతో కలిసి ఉంటుంది కాబట్టి దేహం

చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటుంది. చావని నేను ఒకటి మన హృదయంలో ఉంది. అది చనిపోదు. దానికి దేహం లేదు. దేహం ఉంటే చనిపోతుంది, దేహం లేకపోతే చావు ఏమిటి? అది సత్యమైన నేను, అదే ఆత్మ, అదే చైతన్యం, వాడే ఈశ్వరుడు. చావులేని నేను మనకు అనుభవంలోనికి వచ్చే వరకు చావు పుట్టుకలు తప్పవు, సంసారం తప్పదు, సంకల్ప వికల్పాలు, రాగద్వేషములు తప్పవు. ఎవడైతే చనిపోయే నేనులో నుండి బయటకు వచ్చాడో వాడికి చావులేని నేను తెలుస్తుంది. ఎవడైతే అసత్యమైన నేనులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడు మోక్షమార్గంలో ప్రయాణం చేస్తున్నట్లు గుర్తు. మోక్షమార్గంలో ఉన్నవాడికి మోక్షం తెలుస్తుంది కాని ఆ మార్గంలో లేనివాడికి మోక్షం గురించి తెలియదు. ఆ మార్గంలో ఉన్నామా, లేదా అని మనం చూసుకోవాలి. ఎన్ని శాస్త్రాలు చదివినా ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం గురించి చెప్తారు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రావాలంటే అంత తేలికగా రావు. మనం పాయసం తాగేటప్పడు ఎంత ఇష్టంగా తీసుకొంటామో అంత ఇష్టంగా, శ్రద్ధగా ప్రయత్నం చేస్తే గాని ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాదు. చిరాకుగా, విసుగుగా, అయిష్టంతో ప్రయత్నం చేస్తే అవి స్వాధీనంలోనికి రావు. ఆహార నియమం వలన ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. అధ్యయనం ప్రీతిగా, ఇష్టంతో చేయాలి. ఋషి చెప్పిన మాటలను జాగ్రత్తగా అధ్యయనం చేసి, త్రికరణ శుద్ధిగా పనిచేస్తే వాడికి మోక్షం కలుగుతుంది. మనకు శరీరం, మనస్సు, మాట తెలుస్తున్నాయి. ఈ మూడు ఒకటిగా ఉండి పనిచేస్తే మోక్షం వస్తుంది. మనం హృదయపూర్వకంగా, ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయాలి.

మనకు గతజన్మలను బట్టి అదృష్టం, దురదృష్టం, సంతోషం, దుఃఖం వస్తూ ఉంటాయి. ఇవి అన్నీ అసత్యములే, ఇవిఅన్నీ తలంపులే. అందుచేత వీటి గురించి ఉద్రేక పడకూడదు, కృంగిపోకూడదు. ఇవి సాధకుడికి పనికిరావు. బుద్ధిని సమానంగా ఉంచు కోవాలి. ఏది వచ్చినా భగవంతుడి ప్రసాదంగా తీసుకోవాలి. భగవంతుడికి తెలియకుండా ఏదీ రావటం లేదు. తలంపులు, ఆలోచనలు, రాగద్వేషములు, సంకల్పవికల్పాలు అన్నీ అసత్యమైననేనుకే. ఇవిఅన్నీ చనిపోయే నేనుకే వస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా అసత్యమే. మీకు వెయ్యి కోట్లు డబ్బు ఉన్నా, మీరు డబ్బులేక ఇబ్బందులు పడుతున్నా చైతన్య దృష్టితో చూసినప్పడు ఇదిఅంతా అసత్యమే. మనది పాడుబుద్ధి. మనం పూర్వజన్మలలో మంచికర్మలు చేసిఉంటే, భగవంతుడిని స్మరించి ఉంటే మనకు మంచిబుద్ధి వచ్చి ఉండేది. మనం భగవంతుడికి ఎలా నమస్కరిస్తున్నామో, గురువుకు ఎలా నమస్కరిస్తున్నామో అలాగ మంచి కర్మకు కూడా

నమస్కారం పెట్టాలి. ఈనాటికైనా, ఏనాటికైనా మంచిపనులు చేసేవాడికి, వాడి బుద్ధి భగవంతుడి వైపుకు తిరుగుతుంది కాని చెడ్డపనులు చేసేవాడికి తిరగదు. మీకు ఏ ఆలోచనలు వచ్చినా, తలంపులు వచ్చినా దేహమే కారణం అవుతుంది. ఈ ప్రపంచం అంతా నేను అనుకొంటే మనకు అపకారం చేయదు. ఈ దేహమే నేను అనుకొంటే, ఏ నేను అయితే దేహానికి పరిమితం అయ్యి ఉందో అది మనకు అపకారం చేస్తుంది. తల్లితండ్రులను బాగా చూసినవారు ఎంతో కొంత ప్రజలను కూడా బాగా చూస్తారు. అసలు తల్లితండ్రులనే చూడని వారు ఇంక ప్రజలను ఏమి చూస్తారు. సమాజం మీద, దేశం మీద వారికి ఏమి ప్రేమ ఉంటుంది. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు ఉంటే సాధనతో పని లేకుండా మనస్సు అణిగిపోతుంది. సాధనాసిద్ధులు, కృపాసిద్ధులు అని రామకృష్ణుడు చెప్పేవారు. కొంతమంది కష్టపడి, కష్టపడి సాధన చేసి సిద్ధిని పొందుతారు, వారు సాధనాసిద్ధులు. కొంతమందికి భగవంతుడి కృప వలన జ్ఞానం వచ్చేస్తుంది. మనం లోకం సత్యం, భగవంతుడు అసత్యం అనుకొంటాము. కృపాసిద్ధులు లోకం అసత్యం, భగవంతుడు మాత్రమే సత్యం అనుకొంటారు. వారు మనలాగే ఉంటారు, మనతో కలిసి తిరుగుతారు కాని ఇది అంతా అసత్యం అనుకొంటారు. మీరు పొగిడినా, విమర్శించినా ఇది అసత్యం అనుకొంటారు. వారు మోక్షం కావాలి అని ప్రత్యేకంగా సాధన చేయరు. నేను సత్యం, లోకం అసత్యం అని వీడు అనుకొంటున్నాడు అని ఏమీ సాధన లేకుండానే భగవంతుడు వాడికి మోక్షం ఇచ్చేస్తాడు. వారు కృపాసిద్ధులు, రమణమహర్షి అటువంటి వారే. మనం కూడా భక్తులమే కాని, ఈ ప్రపంచం సత్యం అన్నంత గట్టిగా దేవుడు సత్యం అనే భావన మనకు లేదు. కొంతమంది గొప్పలు కోరుకోరు, గౌరవాలు కోరుకోరు, ప్రశాంతంగా ఉంటారు, నిర్మలంగా ఉంటారు, నిరాడంబరంగా ఉంటారు, నిర్వికారంగా ఉంటారు. ఈ లోకం అసత్యం అనుకొంటారు. అసలు ఈ లోకం మీద నమ్మకం లేనప్పుడు లోకం మెచ్చుకోవాలనే బుద్ధి వారికి ఉండదు. భగవంతుడి దయ వలన వారికి మోక్షం వచ్చేస్తుంది. మనం అటు, ఇటు కాకుండా ఉన్నాము. మనం కష్టపడి సాధన చేయటం లేదు. భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం లేదు. శరీరంలో ఎముకలు, రక్తం, మాంసం, మలం ఉంటాయి. మనస్సులో కోరికలు, కోపాలు, తాపాలు, విసుగు అన్నీ ఉంటాయి. శరీరం అంతా ఎముకల గూడు, మనస్సు అంతా దరిద్రం. ఈ శరీరంతోటి, మనస్సుతోటి ఈ చండాలంతో లోపలఉన్న పురుషుడిని పోలుస్తారా అంటున్నారు ఆచార్యులవారు. ఎంత అపచారం, ఇంతకంటే అపచారం ఇంకేమి ఉంది. మీరు టెన్షన్‌లు పెట్టుకోవద్దు, ఈ

వ్యవహారం అంతా అసత్యమే, ఇది అంతా స్వప్న సమానమే.

హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దానికి మరణం లేదు అని రమణభగవాన్‌కు అప్పుడు తెలియదు, ఒక్కసారిగా మరణం వచ్చి దేహం మీద పడింది, దేహం మరణించింది, మరి నేను చనిపోవాలి కదా, నేను చావులేకుండా ఉన్నాను ఏమిటి అనుకొన్నాడు. దేహంతో తాదాత్మ్యం పొందే అసత్యమైననేనులో నుండి సత్యమైననేనులోనికి ఈశ్వరుడు ఒక్కసారిగా జంప్ చేయించాడు. దేహగతమైన నేను పోయింది, దేహంలేని నేను, మరణంలేని నేను వ్యక్తమయ్యింది. గురువు అయిపోయాడు, దేవుడు అయిపోయాడు. 10 నిమిషాలలో అంతా అయిపోయింది. ఎందుచేత అక్కడ ముగ్గిపోయి ఉన్నాడు, అర్హత యోగ్యత వచ్చింది, దేవుడు కరుణించాడు. వాడే కృపాసిద్ధుడు, నిజమైన నేను అనుభవంలోనికి వచ్చినవాడు ఏమి చేసినా, చేయని వాడితో సమానము. రేడియో పాడుతుంది అని రేడియో బద్దలు కొడితే అక్కడ పాడేవాడు కనబడడు, అది ఎక్కడ నుండో వస్తోంది. అలాగే నిజమైన నేను అనుభవంలోనికి వచ్చినవాడు భగవంతుడు ఏమి చేయిస్తే అది చేస్తాడు అంతేగాని అక్కడ వ్యక్తి కనబడడు. జ్ఞాని ఏపని చేసినా ఇతరుల కోసమే చేస్తాడు. రామకృష్ణపరమహంస దగ్గర లడ్డూకాని, ఏదైనా తినేది ఉంటే వివేకానందుడిని పిలిచి ఆయనే తినిపించేవాడు. ఎందుకు తినిపిస్తున్నాను అంటే నాకోసం కాదు, భవిష్యత్తులో ఇతరులకు చాలామందికి ఉపయోగపడతాడు అందుకు తినిపిస్తున్నాను అని చెప్పారు. తల్లితండ్రులలాగా అని అక్కడ కూర్చొన్నవాడు అన్నాడు. ఏమన్నావు నువ్వు? తల్లితండ్రులకు స్వార్ధం ఉంటుంది, నేను స్వార్థంతో ఈ లడ్డు పెడుతున్నానా? నన్ను తల్లితండ్రులతో పోలుస్తావా అన్నారు. ఆయన సిద్ధ పురుషుడు, వివేకానందుడు ఆయనను ఉద్ధరించేది ఏముంది?

సాధన చేసేటప్పుడు నీకు ఎప్పుడైనా శాంతిగా ఉండవచ్చు, నీవు అనుకొన్న కోరికలు నెరవేరవచ్చు, మహిమలు సిద్ధులు రావచ్చు. అక్కడితో ఆగిపోవద్దు. ఇంకా లోపలకు వెళ్ళాలి. ఆత్మ నీ హృదయంలో ఎంత లోతులలో ఉందో మనస్సు అక్కడకు వెళ్ళాలి. చైతన్యానుభవం కలిగేవరకు నీవు లోపలకు వెళ్ళాలి. నీ సాధన వలన అది తెలియదు, దాని దయ వలన అది తెలియబడుతుంది. జ్ఞాని పని చేసినా చేయనివాడితో సమానము. ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వం లేదు. సాధన చేసేటప్పుడు ఒకోసారి భయం వస్తోంది అని భగవాన్‌ను అడిగితే భయం వస్తే రానియ్యి, నీవు కంగారు పడవద్దు, భయం చనిపోయే నేనుకే వస్తోంది. చూచేవాడు, చూడబడేది, చూడటం ఈ మూడూ నశించాలి. చూచేవాడు అహంకారం, చూడబడేది ప్రపంచం, చూడటం క్రియ. ఇవి మూడూ నశిస్తేగాని ఆత్మ నీకు గోచరం

కాదు. నీకంటే వేరుగా దేనినైనా చూసినప్పుడు కదా భయం. ద్వైతబుద్ధి ఉన్నప్పుడు నీకు భయం వేస్తుంది, అది నశించినప్పుడు నీకు భయం లేదు. ఈ భయం ఎవరికి అని ప్రశ్నించు. ఏదో ఊహించుకొని భయపడుతూ ఉంటారు. పూర్తిగా భగవంతుడి మీద భారం వేసినవాడికి భయం ఏమిటి? భయం వలన అశాంతి వస్తుంది, రాత్రి నిద్రపట్టదు, జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. దేహము నేను అనే తలంపులో నుండే కోరిక, కోపము, భయం ఇవి అన్నీ వస్తున్నాయి. నాకు దేహం లేదు అనుకోండి, దేహంలేనివాడికి ఇష్టం ఏమిటి? అయిష్టం ఏమిటి? మనం చేసేపొరపాటు ఏమిటి అంటే మనం కాని దేహంతోటి, మనం కాని డబ్బుతోటి, మనం కాని చదువుతోటి ఇలా మనం కానిదానితో తాదాత్మ్యం పొందుతున్నాము. ఇలా మనం కానిదానిలో తాదాత్మ్యం పొందటం వలన బతికిఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి.

ఈ లోకంలో అత్యంత నీచమైనది భయం. రోజూ ఎంతమందికి భయపడతాము. భయం పెరిగేకొలది చనిపోయేనేను పెరిగిపోతూ ఉంటుంది. ఈ భయం ఏ నేనుకు వస్తోంది? ఈ నేను ఎవరు అని ప్రశ్నించుకొంటే అది లోపలకు వెళుతుంది. భయం కూడా ఒక తలంపు. దేహము నేను అనేది ఒక తలంపు. ఇది మొదటితలంపు. ఈ తలంపుకు ఇంకో తలంపు వస్తోంది. ఈ మొదటితలంపును లోపలకు ఉపసంహరించు కొంటూ వెళితే భయం కూడా పోతుంది. భయం దేహానికి రాదు, దేహము నేను అనే బుద్ధికి భయం వస్తోంది, అది నువ్వు కాదు. అందులో నుండి విడుదలపొందితే భయం లేదు. చావులేని వస్తువును తెలుసుకొనేవరకు నీకు ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. తాడు నీకు పాముగా కనిపిస్తున్నంతకాలం ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. అది పాము కాదు, అది తాడే అని నీకు తెలిసినప్పుడు ఇంక భయం లేదు. బ్రహ్మమే నీకు లోకంగా కనబడుతోంది. ఏ బ్రహ్మం అయితే లోకంగా వ్యక్తమవుతోందో అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక లోకం కనబడదు, అంతా బ్రహ్మమే కనబడుతుంది, ఆ బ్రహ్మం నీవు అయి ఉన్నావు. రెండు ఉంటే భయం కాని, నిన్ను చూసి నీకు భయం ఏమిటి?

పూర్వం ఒక భక్తుడు 100 సంవత్సరాలు జీవించాడు. ఇంకో వందసంవత్సరాలు ఆయువు ఇస్తాను తీసుకొంటావా అని బ్రహ్మదేవుడు అడిగాడు. మీరు ఇస్తాను అంటే తీసుకొంటాను అన్నాడు. ఈ వందసంవత్సరాలు ఏమి చేస్తావు అని బ్రహ్మ అడిగాడు. ఇప్పడు వంద సంవత్సరాలు బతికాను, ఏదో తపస్సు చేసుకొంటున్నాను, దేహబుద్ధి ఇంకా పోలేదు,

పరమేశ్వరుని యందు నిష్ఠ పూర్తిగా కుదరలేదు. అసలు ప్రయత్నం చేయటం లేదా అంటే చేస్తున్నాను ఈ లోపు 100 సంవత్సరాలు పూర్తి అయిపోయినాయి. మీరు ఇంకో 100 సంవత్సరాలు ఇస్తానంటున్నారు, మీరు ఇస్తే నేను వద్దనను, తీసుకొంటాను ఎందుకంటే నాకు దేహబుద్ధి ఇంకా పోలేదు. ఇప్పడు నేను చేస్తున్న ప్రయత్నం ఇంకా పెంచి, భగవంతుని యందు భక్తి పెంచుకొని ఆయనలో ఐక్యం అవ్వటానికి కృషి చేస్తాను అని చెప్పాడు. మనకు 100 సంవత్సరాలు ఆయుర్థాయం భగవంతుడు ఇస్తే గౌరవాలు, ప్రతిష్ఠ, ధనం పెంచుకోవటానికి ఆ టైము అంతా వేస్టు చేస్తాము, ఇలా జీవితం అంతా వృధా చేస్తాము, చివరకు సున్న. దానం ఇచ్చేవారు కూడా గొప్పలకోసం ఇవ్వకూడదు, భగవంతుని ప్రీత్యర్థం చేయాలి. దానాలు ఇచ్చేవారు చాలామంది గౌరవం కోసం చేస్తారు. పదిమంది ఉండగా అడిగితే పదిరూపాయలు ఇస్తారు, అదే ఎవరు లేనప్పడు అడిగితే పైసా కూడా ఇవ్వరు, తిట్టి పంపిస్తారు. అది దానం కాదు, అది ఖర్మ అన్నాడు భగవంతుడు. రామకృష్ణుడి దగ్గర ఒక ధనవంతుడు కూర్చొన్నాడు, ప్రక్కనే ఒక బీదవాడు కూర్చొన్నాడు. ధనవంతుడితో రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నీ జేబులో ఒక రూపాయి తీసి ఆ బీదవాడికి ఇయ్యి అని చెప్పాడు, అలాగే ఇస్తాను అని చెప్పాడు. ఎందుకు ఇమ్మంటున్నాను అంటే నీ సంపాదన యజ్ఞం అవుతుందని, నీవు ధన్యుడవు అవుతావని, నీవు పవిత్రుడవు అవుతావని ఇమ్మంటున్నాను అంతేగాని నీ రూపాయితో వాడు ఉద్ధరింపబడిపోడు, నీ రూపాయితో వాడి సంసారం వెళ్ళిపోతుందా అన్నాడు రామకృష్ణుడు. ఫల్కీవాలా గొప్ప ప్లీడరు, ఆయన చాలా ధనం సంపాదించాడు. ఆ డబ్బు అంతా సమాజం కోసం ఖర్చు పెట్టాడు, చాలా మంచి పనులుచేసాడు. చివరిరోజులలో ఆయన మంచం పట్టాడు. ఆయనను చూడటానికి వచ్చిన బంధువులు, స్నేహితులు మీరు చాలా తెలివైనవారు, చాలా డబ్బు సంపాదించారు, చాలా మంచిపనులు చేసారు అనేవారు. ఫల్కీవాలా వారితో ఏమని చెప్పేవారు అంటే నేను చదువుకొన్న చదువు మీదకాని, నేను సంపాదించిన ధనం గురించి కాని, నేను చేసిన దానాలు గురించి కాని వాటి మీద నాకు ధ్యాస లేదు. నేను భగవంతుడిలో ఐక్యంఅవ్వటానికి ప్రయత్నం చేసుకొంటున్నాను. నాకు ఇప్పడు కావలసింది భగవంతుడి రూపం, నామం, ఇప్పడు నేను ఆ ధ్యాసలో ఉన్నాను. నేను మర్చిపోవటానికి ప్రయత్నం చేసే వాటిని గుర్తుచేసి మీరు నాకు అపకారం చేస్తున్నారు. లేనిపోని విషయాలు నాకు జ్ఞాపకం తెచ్చి నన్ను బంధంలో పడేయకండి అని వారి చేయి పట్టుకొని చెప్పేవాడు. భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే అక్కరలేని గొడవలు ఏమిటి? నా డబ్బు నన్ను రక్షిస్తుందా? నా చదువులు నన్ను రక్షిస్తాయా? నన్ను

రక్షించేవాడు భగవంతుడు ఒక్కడే. చదువు పొట్టకోసం అనుకొంటారు. సంపాదన కోసం అనుకొంటారు, అది లోకసహజం. చదువు కేవలం పొట్టకోసం కాదు, పొట్ట పోషణతోపాటు ఏ చదువు అయితే మనస్సును పవిత్రం చేస్తుందో అది కదా నిజమైనచదువు అంటాడు ఫల్కీవాలా. కేవలం అన్నం పెట్టేది చదువా? అది మన మనస్సుకు పవిత్రత తీసుకొని రావాలి, ఏకాగ్రత తీసుకొని రావాలి. ఆయన డబ్బు సంపాదించి, డబ్బును జయించి, డబ్బును వదిలిపెట్టాడు, వాడు ఫల్కీవాలా.

ఒకసారి రామకృష్ణుడి దగ్గర నలుగురు, ఐదుగురు కూర్చొన్నారు. నరేన్ అక్కడికి వచ్చాడు. దేవుడు ఉన్నాడా? లేడా? అని అతనికి అనుమానం. కృష్ణుడు భగవంతుడై భగవద్గీత చెప్పాడు అని ఒకరు రామకష్ణుడితో చెపుతున్నారు. కృష్ణుడు దేవుడు అని ఎలా చెప్పగలం, కృష్ణుడే గీత చెప్పాడని ఎలా చెప్పగలం అని నరేన్ అన్నాడు. వీడు లోకాన్ని ఉద్ధరిస్తాడు అనుకొంటున్నాను, వీడి నోటి వెంట ఇలాంటి చెడు మాటలు వస్తున్నాయి ఏమిటి? నా మీద నాకు ఉన్న నమ్మకం, నాకు భగవంతుడు మీద ఉన్న నమ్మకం చెడగొట్టేటట్లుగా ఉన్నాడు అని రామకృష్ణుడు అనుకొంటూ కాళికాదేవి ఆలయానికి వెళ్ళాడు. నీవు కంగారు పడవద్దు, వాడిలో మార్పు స్లోగా వస్తుంది, నీవు అనుకొన్నట్లుగా వాడిద్వారా జరుగుతుంది అని కాళికాదేవి రామకృష్ణుడికి చెపుతుంది. రామకృష్ణానంద ఒకసారి 400 రు॥ తీసుకొని వచ్చి కలకత్తాలో వివేకానందకు ఇస్తారు. మఠం అభివృద్ధి చేయటానికి నీవు మద్రాసులో ఎంత కష్టపడుతున్నావో నాకు తెలుసు. ఇంకా ఈ 400 రూ॥ తెచ్చి నాకు ఇస్తావా అని రామకృష్ణానందకు తిరిగి ఇచ్చేయబోతాడు, ఆయన తీసుకోవటానికి ఇష్టపడడు. నేను వాడుకోవటానికి ఇష్టపడటం లేదు, ఆయన తిరిగి తీసుకోవటానికి ఇష్టపడటం లేదు అని అక్కడ శిష్యులతో చెపుతూ ఈ 400 రూ॥ మీ దగ్గర జాగ్రత్త పెట్టండి, నా శరీరం చనిపోయిన తరువాత రామకృష్ణానంద కుటుంబసభ్యులకు స్వామీజీ ఇచ్చారు అని ఇవ్వండి అని వివేకానంద చెప్పారు. చిన్న మానవహృదయంలో ఇంత ప్రేమ ఎలా దాచుకొన్నాడు అని స్వామీజీ గురించి అనేవారు. అనుకొన్న పనులు అన్నీ అయిపోతూ ఉంటే ఇది అంతా నిజం అనుకొని ప్రపంచంలో కలిసిపోకు. ద్వైతబుద్ధి నశించేవరకు కోపాలు, ఉద్రేకాలు, రోగాలు, ద్వేషాలు వస్తూనే ఉంటాయి. ఈ గొడవలు ఏమీ పట్టించుకోవద్దు. నీ లోపల ఉన్న చావులేని వస్తువును తెలుసుకొనే వరకు నీ ప్రయాణం ఆపవద్దు.

వయస్సు వచ్చి మీద పడుతోంది. జీవితం అనేక పాఠాలు నేర్పింది, ఇంక లోకానికి దూరమవుతున్నాను, స్మశానానికి దగ్గర అవుతున్నాను, జీవితంలో సాయంత్ర సమయం

వచ్చేసింది. భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం, ధ్యానమార్గం గురించి భగవంతుడు చెప్పాడు. బాగా రుచిగా ఉండే మార్గం, మనకు సంతోషం కలిగించే మార్గం, నిదానంగా ఉండే మార్గం భక్తిమార్గం, అన్ని మార్గాలలోకి భక్తిమార్గం తేలిక అని నా మనస్సుకు అనిపిస్తోంది అన్నారు ఫల్కీవాలా. మీరు అనుకొన్న పనులు అయిపోతున్నట్లు స్వప్నంలో వచ్చినా మెలుకువ వచ్చాక సున్నా, జీవితం కూడా అటువంటిదే. పది రకాలు కూరలు వేసుకొని తిన్నట్లు మీకు స్వప్నం వచ్చింది అనుకోండి, మెలకువ వచ్చాక తినటానికి తిండి లేదు అనుకోండి. స్వప్నంలో బాగా తిన్నాము ఇప్పుడు తిండి లేకపోయినా పరవాలేదు అని అనుకొంటారా? అలా అనుకోరు. అలాగే మీరు బాహ్యజీవితంలో ఎంత గొప్పగా బతికినా మీకు ఆధ్యాత్మికబలం లేకపోతే తురీయం దగ్గరకు వచ్చేటప్పటికి సున్నా అయిపోతారు. మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని అక్కడే ఆగిపోకండి, ఇవి ఏమీ నిజాలు కాదు. ప్రతీ మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటానికి బతుకుతాడు, ఇంక అహంకారం ఎలా పోతుంది. ఎవడైతే తన్ను తాను వదులుకొంటాడో వాడికి కదా స్వర్గరాజ్యం అంటాడు ఏసు. తప్పిపోయిన గొర్రెలను కూడా చూస్తూ ఉండండి, వాటిని వదిలేయకండి అన్నాడు ఏసు. కొంతమంది భగవంతుడి మార్గాన్ని వదిలేస్తున్నారు. మీరు వారిని వదలవద్దు, మీకు తెలిసిన మంచిమాటలు వారికి చెప్పి వారు కూడా బాగుపడటానికి సహకరించండి. మనం తప్పిపోయిన వారిని ఉద్ధరించటం మాట అటు ఉంచండి, బాగా ఉన్నవారిని చెడగొట్టకుండా ఉంటే సరిపోతుంది. జీవుడి దగ్గర ఒక చెడ్డ ఉంది. బయటగొడవలు తెలుసుకోమంటే అమెరికా వరకు వెళ్ళిపోతాడు. నీవు ఎక్కడినుంచి వచ్చావో తెలుసుకో అని అంటే వాడు తెలుసుకోడు. వాడు ఎక్కడనుంచి వచ్చాడో వాడు తెలుసుకొంటే వాడు ఇంక ఉండడు, అది వాడికి తెలుసుకాబట్టి ఆ ప్రయత్నం చేయడు. ఏ జన్మకు ఆ జన్మ బయట నొల్లుకొంటూ ఉంటాడు. రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవటం, ఆ దుమ్మును గౌరవం అనుకొని సంతృప్తిపడటం, ఇలా తిరుగుతూ చనిపోతాడు, ఇదే మనం చేసేపని. ఒకసారి శివుడు, పార్వతి మాట్లాడుకొంటున్నారు. ఈ పని చేస్తే ఆ ఫలితం వస్తుంది, ఆ యజ్ఞం చేస్తే ఈ ఫలితం వస్తుంది అని శివుడు పార్వతితో చెపుతున్నాడు. మీరు ఇవి అన్నీ చెపుతున్నారు. అసలు మోక్షం ఎలాగ వస్తుంది అని పార్వతి అడిగింది. ఏదో పని చేయటం వలన మోక్షం రాదు కదా, అందుకు చెప్పటంలేదు అన్నాడు మరి దానికి ఉపాయం లేదా అని పార్వతి అడిగింది. ఒక ఉపాయం ఉంది. సత్పురుషులతో, సాధుపురుషులతో సహవాసాలు చేస్తే వస్తుంది అని శివుడు చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 05-02-06 | ఆది | భీమవరం |
| 12-02-06 | ఆది | ముప్పర్తిపాడు, వయా అత్తిలి |
| 18-02-06 | శని | సఖినేటిపల్లి |
| 20-02-06 | సోమ | గణపవరం సాయిబాబా మందిరం |
| 26-02-06 | ఆది | చించినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## కర్తలేని కర్మ

మనము చేయు కర్మల యొక్క ఫలితం మూడు అంశములపై ఆధారపడి ఉంటుంది. అవి స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం. మన వంతు ఒక పనిని చిత్తశుద్ధితో చేసి, ఫలితం గురించి ఆసక్తి, ఆందోళన చెందకుండా సరియైన కాలం వచ్చేవరకు వేచియుండాలి. సాధన విషయంలో కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది. ఇక మూడవ అంశము, అత్యంత కీలకము అయిన ఈశ్వరుని కృప ఎప్పుడు నిరంతరంగా ఉండేదే! ఈశ్వర కృప సర్వవ్యాపకము, అనంతము. అట్టి చైతన్యమే, నేను కర్తననుకొనే మిధ్యాకర్తకు, ఆకర్త చేయు కర్మకు ఆధారమై యున్నది. వ్యక్తిభావనతో నేను కర్తననుకొన్నా, నిజమైన కర్త పరమాత్మయే! అహంకారమే నిజంగా కర్త అయితే మనము చేయు పని తాలూకు ఫలితాలు మనం కోరుకొన్నట్లుగానే రావాలి, కాని అట్లు జరుగుటలేదు. పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, అనంతుడు కనుక మనము చేసే ప్రతి పనికి సాక్షిగా వుంటూ, నియంత్రిస్తూ వుంటాడు. ఈశ్వరాజ్ఞ లేకుండా ఒక గడ్డిపరక కూడా కదలదు. కర్మఫల ప్రదాత పరమాత్మే! కర్మలను రెండు విధములుగా చెయ్యవచ్చు. 1. నేను చేస్తున్నాననే అహంభావనతో, అట్టి కర్మలు జడకర్మలవుతాయి, పరిమిత ఫలితాలనిస్తాయి. 2. ఆత్మబుద్ధితో కర్మలు చెయ్యవచ్చు అట్టి కర్మలు కర్తలేని కర్మలవుతాయి, అనగా పరమాత్మ చేసేవే అవుతాయి. ఒక పనిని పై రెండు విధములలో ఏరకంగా చేస్తున్నామన్నదే మన సాధనలో కీలకాంశం అవుతుంది.

– **చావలి సూర్యనారాయణమూర్తి,** ప్రధానోపాధ్యాయులు, అమలాపురం




ది॥ 28-11-05న పారిశ్రామిక జ్యోతి శ్రీ కె.వి.కె. రాజుగారి జయంతి మహోత్సవం పశ్చిమ గోదావరి జిల్లా పాతాళమెరకలో జరిగినది. కె.వి.కె. రాజు విద్యానికేతన్ ఆధ్వర్యంలో జరిగిన సభకు సద్గురు శ్రీ నాన్నగారు అధ్యక్షత వహించారు. స్టేట్ మార్కెటింగ్ యార్డు మనేజింగ్ డైరెక్టరు శ్రీ డి. రామకృష్ణగారు ముఖ్య అతిధిగా విచ్చేసి సభలో ప్రసంగించారు. శివవర్మగారు స్వాగతం చెప్పినారు.



కృష్ణా జిల్లా చిన్న తాడినాడ గ్రామంలో ది॥ 26-01-2006న సద్గురు శ్రీ నాన్నగారిని శ్రీ చేకూరి సుబ్బరాజుగారు, వారి ధర్మపత్ని సర్వజిని ఆహ్వానించి హారతి ఇస్తున్న దృశ్యం